వున్నాను. కాని జాగ్రత్తరా అబ్బాయి. ఎక్కువ సారాయి గీరాయి త్రాగేవు. బ్రహ్మ శాపం తగుల్తుంది!"

దొర ఇంకోసారి నాచెయ్యి పట్టుకొని వూగించాడు-నరాలన్నీ జిల్లుమన్నాయి.

దొరసానిని ఇలా దీవించాను - "అమ్మా లక్ష్మి! నీ పెదవుల సింధూరం అక్షయంగా వుండుగాక! వీరప్రసవినివి కావలసిన అవుసరం లేదు - ఆ ఆశీర్వాదం మా అబలలకే రిజర్వుగా వుండనీ. నీవికమీద బీద నల్లవాళ్ళ దుఃఖానికి మాత్రం నిమిత్తురాలవు కావద్దు-యిద్దరు ముగ్గురు వొడుదుడుకు లేని పిల్లల్ని కని సంసారం చక్కగా నడుపుకో".

దొరసాని ఆపళాన ముఖం ఎత్తి, నా అయిదు రోజులనుంచీ గొరగని - సూదు లల్లే పొడుచుకొచ్చిన గడ్డం మీద....

"అరే. ఛీ, ఛీ," వినోదు డన్నాడు.

"ఊ! దేవి చౌధరాణిలో ఇలాగే వ్రాసి ఉందికదూ?"

"సరే చటర్జీగారూ, పండు మిరపకాయల రుచి ఎట్లావుంది!"

"అబ్బే. అందులో కారం ఏమీ లేదు! అరే! వాళ్ళ రివాజే అంత. ఎవరికన్నా గౌరవ మర్యాదలు చూపించాలంటే అట్లాగే చేస్తారు. దీనికి సిగ్గుపడటం ఎందుకు?"

అని చటర్జీ మళ్ళీ చెప్పసాగాడు: "తర్వాత చూద్దునుగదా, పొడుగు పొట్టి దొర లిద్దరు మొఖము వ్రేలాడేసుకొని దిగి పోతున్నారు-వాళ్ళ సామానుకూడ కూలీలు దించివేశారు."

బండి [illegible]ంది. బిల్లూ జోనూ, చేతులు చేతులు కలుపుకొని డాన్సుచేయ సాగేరు. నేను నోరుతెరచుకుని చూస్తూ వుండిపోయా.

"చటర్జీ! ఇటువంటి ఆనంద దినములో యీమాదిరి గ్లూమీగా కూర్చుంటం నాకేమీ బాగుండ లేదు; మా డాన్సులో కలువు" అంది జోన్.

"మదర్ లక్ష్మి, నా మోకాళ్ళు వాతనొప్పులతో పట్టుకుపోయాయి. ఎగరవద్దని వైద్యుడి సలహా" అన్నాను నేను.

"ఐతే నీవు పాటన్నాపాడు మేంఆడతాం."

ఏంచేసేదీ - కిరస్తానీవాళ్ళచేతిలో చిక్కనే చిక్కాను. తప్పుతుందా? మువ్వ గోపాలుని పదం ఎత్తుకున్నాను.

ఈ కాలక్షేపంతోనే మొగల్‌సరాయి వచ్చేసింది. కలకత్తా చేరగానే వాళ్ళు పెళ్ళిచేసుకుంటారనీ, మూడు రోజు లున్నాక గ్రాండ్ హోటలులో నన్ను కలుసుకొమ్మనీ దొరసాని మరీమరీ ప్రార్థించింది. మెనీ మెనీ షేక్ హేండ్సూ, చాలా చాలా సలాములనికూడా చెప్పింది.

తర్వాత నేను కాశీవెళ్ళే బండిలో కూర్చున్నాను!...

రెండోరోజున కలకత్తా బయలుదేరాను.

* * *

"ఏమండీ చటర్జీగారూ, యింటావిడెకు యీ సంగతు లన్నీ తెలిశాయా లేదా?" అని వినోదబాబు అడిగాడు.

"ఏం, ఎందుకు తెలియవు? ఒకటి-ఆవిడ పతివ్రత, రెండోది పాపట్లోకూడా నెరసింది. మీ ఇప్పటి పిల్లలమాదిరి తెలివి తక్కువది కాదు, అలిగి బిగించుకుంటానికి! ఇంటికి రాగానే అన్ని సంగతులు చెప్పేశాను."

"విని ఏంచేసిందీ?"

తక్షణమే ఓఢ్ర మంగలిని పిలిపించి "ఏయ్, ముసలయ్యకు గడ్డం గొరుగు, కొంచెం అణచిపట్టి! కిరస్తానీది ఎంగిలిచేసింది" అంది. తర్వాత వుంగరం తీసుకొని గంగాజలంతో కడిగి వ్రేలిని తగిలించుకుంది.

"పెళ్ళి ధప్పళం ఎట్లావుంది?"

"అరే, ఇంకా ఆ ఏడుపేమి వింటావు? గ్రాండు హోటలుకువెళ్ళి అడిగితే అక్కడ ఎవ్వరూ లేరని తెలిసింది - 'ఆఁ, వుంటం నిజమే. కాని పెళ్ళయిన మర్నాడే పాడుముండ పారిపోయింది. దొరగారు వెతకటానికి వెళ్ళారు,' అని బట్లరు చెప్పాడు."



# శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః



## -కొ: కుటుంబరావు-

"శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః. అయ్యా, ఇవాళ...."

తిథి వారనక్షత్రాలూ, త్యాజ్యమూ ఏకరువు పెట్టాడు భైరవశాస్త్రుల్లు.

"శాస్త్రుల్లుగారికి ఉపాదానం వెయ్యండర్రా." అని కేకపెట్టాడు మాధవరావుగారు.

"అయితే చూడండి, బాబూ. తమ తండ్రిగారి తిథి ఎల్లుండే. గుర్తుందికాదూ?" అన్నాడు శాస్త్రుల్లు ప్లీడరుగారితో.

"అవునండీ. మీ అబ్బాయిగారు ఊళ్ళో ఉన్నారా?"

"ఎల్లుండికి ఉంటాడు లెండి. వాడూ నేనూ తప్పక వస్తాం. వేరే ఎక్కడా చెప్పకండి."

సరేనన్నాడు మాధవరావుగారు. ఆయన భార్య దోసెడు బియ్యంతెచ్చి శాస్త్రుల్లుగారి చెంబులో వేసింది.

శాస్త్రుల్లు వెంటనే నిష్క్రమించక, "అయితే చూడండి. బాబూ? ఈ యేడు మా రెండోవాణ్ణి బళ్ళో వేద్దా మనుకుంటున్నాను. నలుగురూ తలా యింత సహాయం చేస్తున్నారు. తమరుకూడా—" అని ఆగాడు.

"అట్లాగే చూతాంలెండి. కుర్రవాడి చదువెంత భాగ్యం?....అవునుగాని ఆచారం తప్పిస్తున్నారేం?" అన్నాడు మాధవరావుగారు నవ్వుతూ.

"ఇంగ్లీషు చదువు చెప్పిస్తున్నా నేమంటున్నారా? చూడండి, బాబూ. నేను వేదం చదువుకున్నాను. ఏం బావుకున్నాను? అక్షయపాత్ర తప్పలేదు. మా పెద్దవాడికి శాస్త్రం చెప్పించాను. 'అబ్బో, తర్క వ్యాకరణాల్లో నీ కొడుకంతవాడు లే' డన్నారు. ఏం లాభించిందీ? సంభావనలకూ, సన్మానాలకూ తెగ తిరిగి ఆరోగ్యం పాడుచేసుకున్నాడు. హైదరాబాదులో ఏమిటో కొల్లబోతున్నదని అక్కడి[illegible] కెళ్ళాడు. అక్కడ ఎంత అవమానం జరగాలో అంతా జరిగింది. ఆ తురక సామ్రాజ్యంలో తద్దినం మంత్రాలూ, సంధ్యావందన ముక్కలుకూడా రాని తాగుబోతు వెధవలు పెద్దవాళ్లయి కూర్చున్నారు. మనవాళ్ళే ఇక్కణ్ణుంచి వెళ్ళినవాళ్ళే. అయితే ఏం యాచకో యాచకశ్శత్రుః! మావాడికి వా[illegible] పోగుపడ్డ వెధవలతోపాటు సంభావన లివ్వ[illegible] చారుట. జబ్బుపడి చక్కా వచ్చాడు."

"మన తెలుగువాళ్ళకు జన్మే అంతలెం[illegible] ఎంత మానవ స్వభావమైనా ఎక్కువస్థితి[illegible] ఉన్నవాణ్ణిచూసి ఓరవలేకపోవటంలో అర్థ[illegible] వుంది గాని, మనవాడు వెయ్యి రూపాయ[illegible] సంపాదించుకుంటున్నా పది రూపాయ[illegible] తెచ్చుకునేవాణ్ణిచూసి కళ్ళలో నిప్పులు పో[illegible] కుంటాడు. అట్లాచూస్తే తెలుగుజాతం అడుక్కుతినేజాతే."

"బాగా సెలవిచ్చారు!....ఇక ఈ యాయవారం చాలొచ్చింది. మా రెండో వెధవనైనా ఇంత ఇంగిలీషుచదువు చెప్పించి గౌరవంగా బదికే సదుపాయం చేద్దామని చూస్తున్నాను."

"నన్నడిగితే మంచిపని చేస్తున్నారంటాను. మా వాణ్ణికూడా ఈయేడే స్కూల్లో ప్రవేశపెడుతున్నాను. మావాడికి చదువురాదేమోననిపిస్తుందండీ. ఆ వెధవకు గట్టిగా రెండో ఎక్కంరాదు. వాడికి లెక్కలు బొత్తిగరావు. ఇంగ్లీషుకూడా అంతంతమాత్రమే. తెలుగేదో కాస్త ఏడుస్తాడు. అందుకని మా బావమరిదిని—వీడే మా రెండో బావమరిది—ఇక్కడేవుండి పిల్లవాడికి కాస్త చదువు చెప్పరా అన్నాను. మా గోపాలం ఇంటరు చదివి ట్రెయినింగు కూడా అయినాడు. స్కూల్లో ఏదైనా మేస్టరుపని దొరుకుతుందేమోనని చూస్తున్నాడు. స్కూలు కమిటీ చూడబోతే నానా అయోమయంగానూ ఉంది. అక్కడా పార్టీలూ! నియ్యోగులూ వైదీకులూనూ! కొట్టుకు చస్తున్నారు. మావాడికి ఉద్యోగం ఇవ్వటానికి ప్రయత్నిస్తామన్న వాళ్ళంతా మైనారిటీవాళ్ళు. మెజారిటీలో ఇద్దరు ముగ్గురైనా మావాడికోసం పాటుబడితేతప్ప ఉద్యోగం అయేటట్టులేదు. ప్రస్తుతం మీవైదీకులదే అక్కడ రాజ్యంగా వుంది—నేనన్నానని కోపం వద్దు," అన్నాడు మాధవరావుగారు.

"ఉన్నమాటకు తప్పేమిటి, బాబూ.... అయితే, చూడండీ! తమపేరేమిటన్నారూ? గోపాలంగారా? మీరు పంతులుగారి పిల్లవాడికి చదువు చెప్పేటప్పుడు కాస్త మావాణ్ణి కూడా దగ్గిర ఉండనివ్వండీ? మావాడి కోసరం తమరేమీ శ్రమ పడక్కర్లేదు. చదువులో మావాడేమంతపరవాలేదు. అదీకాక పక్కన ఇంకోకుర్రాడుంటే పంతులుగారి పిల్లవాడిక్కూడా కొంచెం ఉత్సాహంగా ఉంటుంది. ఏమంటారు?"

"దానికేం భాగ్యంలెండి. అట్లాగే పంపించండి," అన్నాడు గోపాలం.

తనపని అయిపోగానే భైరవశాస్త్రుల్లు శెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

"ఉద్దండుడల్లే ఉన్నాడే! చీపురుపుల్లకూడా ఊరికే దొరికితే పోనిచ్చేట్టు కనిపించదు. దరిద్రం మలుషులచేత అటువంటు పనులు చేయిస్తుందనుకుంటా" అన్నాడు గోపాలం. అతనూ దరిద్రంలో ఉన్నవాడే.

"దరిద్రం ఏమిట్రా, నీమొహం! ఆయనకు కనీసం పదిహేనెకరాలపొలం ఉంది. ముప్పై ఏళ్ళనుంచీ జోలెపట్టుకు తిరుగుతున్నాడు. నేనింతవా[illegible]ప్పట్నుంచీ ఎరుగుదును. అప్పటికీ ఇప్పటికీ అయన అలవాట్లు మారలేదు. ఆ సీరుకావిగుడ్డలే కడతాడు. ఆ అంగోస్త్రమే పైనవేస్తాడు. ఆపూరిగుడిసెలోనే ఉంటున్నాడు. ఈ ఊళ్ళో కనీసం వంద ఇళ్ళలో ఆయనే తద్దినాలుపెట్టిస్తాడు, పెళ్ళిళ్ళో వడుగులూ చేయిస్తాడు, అపరక్రియలుకూడా తనే చేయిస్తాడు. రోజు కైదారు మానికలబియ్యం సంపాయిస్తాడు. దొడ్లో ఒక కరేపరెబ్బదగ్గిర్నుంచీ గుమ్మడికాయవరకూ ఏదికనిపించినా దేహీ అని చెయ్యిచాస్తాడు. నెలకు రెండురోజులన్నా ఇంట్లో వంట చేయిస్తాడో లేదో. అన్ని ఇళ్ళలోనూ ముత్తయిదువు పెట్టుకుంటే ఆయన పెళ్ళాం ఉంది. ఎవరింటోనన్నా పెళ్ళి అయితే అయిదురోజులూ వడ్డనలూ అవీ చేస్తుంది. యాభైయేళ్ళున్నయ్యా, ఇప్పటికీ మనం ఇద్దరం తినలేని తిండితిని హరాయించుకుంటాడు. నల్లగా చావదేలి ఎట్లాఉన్నాడోచూడు. ఉక్కుముక్క!"

"ఓరి విడుగా!...వీడి కొడుక్కా నేను ఊరికే పాఠాలుచెప్పేదీ? కావలిస్తే నా ఆస్తిని అయిదుసార్లు కొనేస్తాడుగదా!" అన్నాడు గోపాలం. భైరవశాస్త్రుల్లువంటి మనుషులుంటారని అతను కల్లోకూడా ఎరగడు.

## 2

భైరవశాస్త్రుల్లు కొడుకు చదువుకుగాను లోకులదగ్గిర పాతిక రూపాయలు పోగుచేశాడు. అవి సత్యనారాయణ ఏడాదిచదువుకుగాను జీతానికీ పుస్తకాలకూ రెండుజతల బట్టలకూ కూడా సరిపోతై. ఇంకా అయిదో ఆరో మిగులుతై కూడానూ.

సత్యనారాయణనూ, మాధవరావుగారబ్బాయి రంగారావునూ బళ్ళోవేసిన రెండు మూడు రోజుల్లోపల మాధవరావుగారి బావమరిది గోపాలానికి తలవని తలంపుగా ఉద్యోగం అయింది. అవుతుందని మాధవరావుగాని, గోపాలంగాని కల్లోకూడా అనుకోలేదు. మాధవరావు ఈవిషయం స్కూలు ప్రెసిడెంటుతోనూ సెక్రటరీతోనూ ప్రస్తావించినప్పుడిద్దరూకూడా అసహ్యంగా మాట్లాడారు.

ఈ రహస్యం సత్యనారాయణద్వారా రంగారావుకు తెలిసి, రంగారావుద్వారా పెద్దవాళ్ళకు తెలిసింది. సత్యనారాయణ రోజూ మాధవరావుగారింటికి వచ్చి ఒక గంటసేపు రంగారావు పక్కనేకూచుని గోపాలంచెప్పే పాఠాలు వింటుండేవాడు. గోపాలానికి ఉద్యోగం ఇప్పించింది భైరవశాస్త్రుల్లేనని సత్యనారాయణ రంగారావుతో రహస్యంగా అన్నాడు.

మొదట మాధవరావు ఈమాట నమ్మలేకపోయినాడు. కాని ఆలోచించినకొద్దీ నిజమై ఉండా లనిపించింది. ఏమో ఉద్దండ ముండాకొడుకు! ఆ ప్రెసిడెంటు దగ్గరికీ, సెక్రెటరీ దగ్గరికీవెళ్లి కాస్త గట్టిగా చెప్పాడేమో!

మర్నాడు ఉపాదానానికి వచ్చినప్పుడు మాధవరావుగారు భైరవశాస్త్రుల్లుతో, "విన్నారా! మా గోపాలానికి స్కూల్లో ఉద్యోగం దొరికింది," అన్నాడు.

"చాలా సంతోషం! ఎందుకు దొరకదండీ, చక్కగా చదువుకున్నవారికీ? మావాడు[illegible]డా చెప్పాడు, పాఠాలెంతో విశదంగా చెబుతారుట. వారిధర్మమా అంటూ మావాడి కింత చదువచ్చితే!" అన్నాడు శాస్త్రుల్లు.

"శ్రీ కృష్ణార్పణం"గా ఇన్నిబియ్యం చెంబులో పోయించుకుని, నిండిన చెంబులో బియ్యం జోలెలోకి మార్చుకుని శాస్త్రుల్లు వెళ్లిపోయినాడు.

"దొంగముండా కొడుకు, అంతు చిక్కలా!" అన్నాడు గోపాలం. "ఈపుణ్యం ఈబ్రాహ్మడు కట్టుకున్నదే. సందేహంలేదు. ఎటువంటివాళ్ళకు ఏవిధంగా రుణపడతామో చెప్పలేంకద!"

గోపాలం కృతజ్ఞతతోగూడిన హృదయం గలవాడు. పైకిచూపడం అలవాటులేకపోయినా అతను తన కితరులుచేసే చిన్నచిన్న ఉపకారాలు మరిచిపొయ్యేవాడుకాడు. ఇతర లకు చిన్నచిన్న ఉపకారాలు చేసే అవకాశ తనకు దొరికితే పోనిచ్చేవాడుకాడు. ఇటువం వాళ్ళు ప్రపంచాన్ని ప్రేమించటానికి ప్ర త్నించి పరాభవం పొందుతూంటార ప్రపంచం మంచివాళ్ళ చేతుల్లో ఉంటే గో లంవంటివాళ్ళు ఉపకారం తక్కువ పొం

టమూ పరాభవం ఎక్కువ పొందటమూ తరుచు జరగదు. తనకు పరాభవం జాస్తిగా జరగబట్టే గోపాలం ఉపకారం చేసేవాళ్ళని మరింతగా జ్ఞాపకంపెట్టుకునేవాడు.

ఉద్యోగం దొరికిందన్న మాటేగాని స్కూలులో తనను హెడ్మాష్టరూ, పెద్ద మేస్టర్లుగావున్న ఇతర వైదీకి మేస్టర్లూ చిన్న చూపు చూస్తారనీ, తన లోపాలన్నీ చిట్టావేసి కమిటీవారి కందజేస్తూ వుంటారనీ, తనమీద వేగు వుంటుందనీ గోపాలానికి తెలుసు. బళ్ళో మేస్టర్లంతా చెడ్డవాళ్ళు కారనీ గోపాలానికి తెలుసు. అందులో మంచివాళ్లున్నారు. కాని వాళ్ళు అరణ్య మృగాలల్లే స్వార్థం చూసుకోవటంలో మునిగి వున్నారు. తనకు పైవాళ్ళవల్ల అన్యాయం జరుగుతుంటే, అన్యాయమని నమ్మినా, వాళ్ళు దాన్నిగురించి ఏమీ చెయ్యరు. తమ కన్యాయం జరుగుతూంటే ఇతర్లు సహాయం చెయ్యకపోయినా చెయ్యలేదనుకోరు. వీళ్ల దాస్యంలో వుండటమేకాక దాస్యం ఆమోదించారు కూడానూ. ఆమాటకొస్తే గోపాలంకూడా దాస్యం ఆమోదించినవాడే మరి....

సత్యనారాయణ, పాపం, రంగారావుతో పాటు కూర్చునేవాడేగాని గోపాలాన్ని ఒక్క ప్రశ్న అడిగేవాడుకాడు. నోరుతెరిచేవాడేకాడు. ఈ రెండు మూడు రోజుల్నుంచీ జరిగిన పాతాలేమిలేకపోయినా, సత్యనారాయణతో మాట్లాడనన్నా మాట్లాడనందుకు గోపాలానికిప్పుడు పశ్చాత్తాపం కలిగింది. ఇప్పుడు సత్యనారాయణకు రంగారావుతోపాటు సమానమైన శ్రద్ధను చూపసాగాడు. సత్యం చాలా చురుకైన కుర్రవాడనీ, ఎంతో మంచి మార్కులు తెచ్చుకోవటంకోసం భైరవ శాస్త్రుల్లు తనకొడుకును పంపిస్తున్నాడనీ గోపాలానికర్థమయింది. తనచేతిలో ఉన్నంత వరకూ సత్యాన్ని పైకి తెద్దామనీ, బాగా కని పెట్టివుందామనీ అనుకున్నాడు.

కాని గోపాలం ఆశయం నెరవేరే యోగ్యత లేకపోయింది. ప్రైవేటు ట్యూషన్లు చెప్పరాదనీ, డబ్బు తీసుకున్నా తీసుకోకపోయినా ప్రైవేటు ట్యూషనుకు స్కూలు నిబంధనలు వొప్పుకోవనీ గోపాలానికి హెడ్మాస్టరుగారు తెలియజేశారు. రంగారావుకు గోపాలం సహాయం చెయ్యకుండా అడ్డపడటం బ్రహ్మవశంకాదు. గోపాలం వాళ్లింటోనే వుంటున్నాడు. కాని సత్యంమటుకు తన స్వగృహంలోనే చదువుకోవలిసి వచ్చింది.

## 3

గోపాలం ఉద్యోగం ఏప్రిల్ నెలతో అయిపోయింది. అతని ఉద్యోగం అక్కడతో అంతంచేసి రెండు నెలలజీతం—తొంభైరూపాయలు — ఆదాచేశారు స్కూలు కమిటీవాళ్ళు. ఆ ఉద్యోగం అయిపోయినందు కతనికి విచారం కలగలేదు. స్కూలు కక్షల మూలంగా అతను చాలా అవమానాలు భరించాడు. ఎంతో ఓర్పుగలవాడైనప్పటికీ అతనికి ఎప్పుడో నౌకరిమీద విసుగెత్తింది. స్కూలు మటుకు మంచి ఉపాధ్యాయుణ్ణి కోల్పోయింది. స్కూలందు విషయమై విచారపడలేదు.

స్కూలు కమిటీవాళ్ళ నిరంకుశ ప్రవర్తన ద్వారా గోపాలం చాలాడబ్బు కోల్పోయినాడు. కనీసం పదిహేనుమంది స్కూలు విద్యార్థులు అతనిదగ్గిర ట్యూషను చెప్పుకోవటానికి తయారయినారు. కొత్త మేస్టరనే నెపంమీద కమిటీవారతన్ని ట్యూషనులు చెప్పుకోనివ్వలేదు.

స్కూలులో అనేకమంది ఉపాధ్యాయులు ట్యూషనులు చెప్పుకుంటున్నారు. దత్తాత్రేయులింటోనూ, రామ్మూర్తి ఇంటోనూ, శివరామయ్య ఇంటోనూ, గణపతి ఇంటోనూ, పాతికమందీ, ముప్పైమందీ విద్యార్థులు ట్యూషన్లు చెప్పుకుని అక్కడే పడుకునేవాళ్లు. పరీక్షలు దగ్గిరికొస్తున్నకొద్దీ ఈ విద్యార్థుల సంఖ్య దాదాపు రెండింతలకు పెరిగేది. కొంతమంది క్లాసుకు క్లాసు ఇంటిదగ్గిర చేర్చుకునేవాళ్ళు.

ఈ విద్యార్థులకు క్లాసుల్లో రానిపాఠాలు ఇంటిదగ్గిర ఎట్లావస్తాయి? ఏ ఆశతో ఈ విద్యార్థుల తలిదండ్రులు నెలకు అయిదేసి రూపాయలిచ్చి ట్యూషన్లు చెప్పిస్తున్నారు?

ట్యూషన్లు చెప్పించుకునే విద్యార్థులకు క్లాసులో ఎక్కువ మార్కులు రావటం రివాజు. క్లాసుపరీక్షల్లో వీళ్లెప్పుడూ తప్పరు. అయితే అఖరు పరీక్షమాటేమిటి? అదీ ఉపాధ్యాయుల చేతుల్లో వున్నదే. ఎల్లయ్య క్లాసుపేపరు పుల్లయ్యచేతిలో వుంటుంది. పుల్లయ్య క్లాసు పేపరు మల్లయ్యచేతిలో ఉంటుంది. అంతా బీరకాయపీచే. నీ పేపరు నాకుచూపించు, నా పేపరు నీకుచూపిస్తా! అంతా పొట్టకోసం దేవులాడుతున్నవాళ్లే.

ఫలితమేమిటంటే స్కూలుఫైనలువరకూ దేదీప్యమానంగా వెలిగినవాడు గవర్నమెంటు పరీక్షలో గొడ్డుపడ్డట్టు పడటంజరిగేది. ఇంత డబ్బూ బుగ్గిలోపోసిన పన్నీరయిందని అప్పటికి తెలిసివచ్చేది పిల్లల తండ్రులకు. యాభై రూపాయల జీతంగల మేస్టరు, పైన నూటయాభై సంపాదించటం విడ్డూరంగా వుండేదికాదు. స్కూలు కమిటీ కట్టుదిట్టాలతో కూడుకొనివుంటే మేస్టర్లింత

తెంచుకుపడటాని కవకాశం వుండకపోను
కాని ఈస్కూల్లో కుళ్లంతా కమిటీలోనే
వుంది. ఉపాధ్యాయుల పైసంపాదనలో భాగం
తీసుకుని సెక్రటరీగారే చాలా వేలు సంపా
దించాడని ప్రతీతి వుండేది. నిజంకూడా
కావచ్చు.

స్కూలు విద్యార్థులలోమటుకు గోపాలం
చాలా గట్టిమేస్టరనే ప్రతీతి పడిపోయింది.
చదువంటే ఇష్టంవున్నవాళ్ళూ, లేనివాళ్ళూ,
మెత్తనివాళ్ళూ, అల్లరివాళ్ళూ—అందరూ
ఏకగ్రీవంగా గోపాలమంటే గౌరవంగా వుండే
వాళ్ళు. శలవల్లో నలుగురైదుగురు విద్యార్థుల
రెండోఫారం కింది తరగతులవాళ్లు అత
దగ్గరికి ప్రైవేటుకొచ్చి నెలకు పదీ పదిహేనూ
ఇరవైకూడా ఇచ్చి శలవలాఖర్న వేరే ఊళ్ళల
పైతరగతుల్లో ప్రవేశించటానికి ఆశపడ్డార
వీళ్ళంతా పాసవుతామనే ఆశఏమీలేని బాపత
అయినా గోపాలం ఈట్యూషన్లు ఒప
కున్నాడు. సత్యాన్నికూడా శలవుల్లోవ
తనదగ్గిర చదువుకోమన్నాడు. కేవలమ
ప్రైవేటు ట్యూషన్లుచెప్పి బతకవచ్చుననే
పుట్టింది గోపాలానికి.

ఈవిధంగా గోపాలం ఒక సంవత్స
గడిపాడు. మరుసటి సంవత్సరానికి పరిస్థిత
తారుమారై స్కూలు కమిటీలో నియోగి
సంఖ్య హెచ్చి వారికి పెత్తనం లభించి
ఒక్కసారిగా పదిమంది నియోగి మెం
వచ్చి స్కూలు కమిటీలో చేరారు. స్కూ
ఆర్థికపరిస్థితులు బాగుండని కారణం
స్కూలు నిర్వహణంగురించి పూళ్ళో అ
జాస్తికావటంవల్లా ఈమార్పు తాత్కాలిక
మంచిదే అయింది.

ఇతర విషయాలెట్లావున్నా గో
తిరిగి వుద్యోగం సంపాదించాడు. స్కూ

సంవత్సరం అది ఖాయంకూడా అయిపోయింది.

గోపాలం సత్యానికి శాశ్వతమైఫ మేస్టరయిపోయినాడు. సత్యం ప్రతిఏడూ దాదాపు ప్రతిసబ్జక్టులోనూ మొట్టమొదటి మార్కు తెచ్చుకుంటుంటే గోపాలానికి స్వయంగా ఎంతోగర్వంగా వుండేది. రంగారావు మొదటి సంవత్సరమే వెనకపడిపోయినాడు. అయినా సత్యాన్ని గోపాలం వదల్లేదు. రోజూ సత్యం గోపాలంగారింటోనే చదువుకునేవాడు, అక్కడే పడుకునేవాడు. అతని కింటో పడుకునే అలవాటుకూడా తప్పిపోయింది.

సత్యం మూడోఫారం చేరిన సంవత్సరం గోపాలం అతన్ని తన సెక్షనులోనే వేసుకున్నాడు. ఆ సంవత్సరం సత్యం చదువులో తీసుకున్న శ్రద్ధ గోపాలం మరే విద్యార్థి చదువులోన్నూ ఎన్నడూ తీసుకుని వుండలేదు.

ఆతరవాత సత్యానికి గోపాలం మేస్టరుగా వ్యవహరించలేదు. తనతో సమానంగానే చూసుకున్నాడు. తన ఇంటోనే సత్యాన్ని చదువుకోమన్నాడు. అప్పుడప్పుడూ అతని చదువుగురించి విచారిస్తూ వచ్చాడు. కాని స్వయంగా దగ్గిరకూర్చుని నూరిపొయ్యలేదు.

సత్యం స్కూలుఫైనలు పరీక్ష కూర్చునే నాటికి అతని జీవితంలో గోపాలం ఒకగొప్ప స్నేహితుడుగా తయారై సిద్ధంగా వున్నాడు.

## 4

ఇంకా కొద్దిరోజులకు పరీక్షఫలితాలు తెలుస్తాయనగా ఒకనాడు సత్యంవచ్చి గోపాలంతో, "మేస్టారూ, మా నాన్న నాపెళ్ళి చేద్దామని చూస్తున్నాడు. మీరేం సలహా చెబుతారు?" అని అడిగాడు.

సత్యం ఆమాట లంటూండగా గోపాలం చేతిలో ఒక ఉత్తరం వుంది — ఒకానొక స్నేహితుడు రాసినది. ఆ క్షణంలో సత్యం వచ్చి ఈ వార్తచెప్పి సలహా అడగటం గోపాలానికి దైవికంగా కనిపించింది.

"నన్నడిగితే చేసుకోమనే అంటాను. ఇంకా ఆలస్యంచేశావంటే పిల్ల నీకన్న మరీ చిన్నదైపోతుంది. దురదృష్టవశాత్తు మన సంఘం రజస్వలానంతర వివాహాలు ఒప్పుకోదాయె.... కాని ఒక్కపని చేస్తావా, సత్యం? అర్జంటుగా నేను మీనాన్నగారితో ఒక విషయం మాట్లాడాలి. ఆయనకెప్పుడు వీలవుతుందో కనుక్కో. పెద్దవాడు, ఆయన నాదగ్గిరికి రానక్కర్లేదు, నేనేవచ్చి మాట్లాడుతాను," అన్నాడు గోపాలం.

"అదేమిటండీ, మాస్టారూ? ఆయనే మీదగ్గిరికొస్తాడులెండి. ఆయనతో ముందుగా అప్పాయింటుమెంటు పెట్టాలా?" అన్నాడు సత్యం.

"అట్లాకాదు, సత్యం. ఈ విషయంలో న్యాయంగా నేనే ఆయనదగ్గిరికి వెళ్ళాలి."

"పరవాలేదులెండి నేనింటికివెళ్ళి చెప్పగానే బయల్దేరిరాడూ?" అంటూ సత్యం శలవు పుచ్చుకున్నాడు.

సత్యం చెప్పినట్టే మరో పావుగంటలో భైరవశాస్త్రుల్లు గోపాలంగారింటిదగ్గిర హాజరయినాడు.

"రండి, శాస్త్రుల్లుగారూ, దయచెయ్యండి. పెద్దలు మీరే వచ్చారు," అన్నాడు గోపాలం.

"రావటం నావిధి," అన్నాడు ముసలాయన. ఆయనకిప్పుడు అరవై చేరబడుతున్నై. కొంచెం వయస్సుకూడా కనిపిస్తున్నది. గోపాలం ఆయన్ను బలవంతాన కుర్చీలో కూర్చోబెట్టాడు.

"మరేంలేదు మీవాడి వివాహంగురించి అనుకుంటున్నట్టు నాకు చూచాయగా తెలిసింది. అముక్క నిజమేనా?"

"అనుకోవటంవరకూ చేతిలో పనేగనక అనుకున్నమాట నిజమే. తమకు చెప్పుదామనుకుంటున్నాను కూడానూ. నాకు తమకంటె ఆప్తులెవరున్నారూ? తమరు మావాడి విషయంలో తీసుకున్న శద్ధ మరెవరు మటుకెందుకు తీసుకుంటారు గనకా? వాడి పురాకృతపుణ్యమో ఏమిటో అనుకుంటాను!"

"ఎంతమాటన్నారు? పైకొచ్చే విద్యార్థి నావాడని చెప్పుకుందామని ఏ మేస్టరుకుండదు చెప్పండి. రేపు మీవాడు పెద్దవాడైతే నేను చెప్పుకుని గర్వపడనూ?" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"ఏజన్మానో మావాడు పెట్టి పుట్టబట్టే తమరంతగా వాడియందు నమ్మకం వుంచటం జరిగింది.... ఇంతకూ వాడి పెళ్ళి విషయం అడగటంలో తమ వుద్దేశం—?"

"మరేమీలేదు. మీరు పిల్లవాడికి ఏపాటి కట్నం కోరుతున్నారు, ఎటువంటి అభిప్రాయంలో వున్నారో తెలుసుకుందామనే!"

భైరవశాస్త్రుల్లు కనిబొమలు ముడేసి రెండు క్షణాలపాటు నేలకేసిచూసి తలపైకెత్తి మనస్సులో వున్నమాట చెబుతున్న వాడల్లే, "అయ్యా, నేను పెద్ద గొంతెమ్మ కోరిక పెట్టుకున్నాను. మనస్సులో ఉన్న దురాశ బయటికి చెప్పేస్తే పోయింది. నా రెక్కలు బలహీనమై పోయినై. శరీరంలో పూర్వపు దార్ఢ్యమూ బవసత్వాలూ లేవు. పోనుపోను కుర్రవాడి చదువు నాకు భారమైపోతుందా అనే భయంపట్టుకుంది. ఇదివరకల్లా వద్ద కష్టమేమో పడనే పడ్డానుగాని ఇకనైనా, ఈ మిగిలిన నాలుగురోజులూ, కృష్ణారామా అంటూ ఇల్లుకదలకుండా కూచుందామనిపిస్తున్నది. పిల్లవాడిభారం పిల్లనిచ్చేవారు వేసుకుంటే—వాడెంతవరకు చదువుకుంటానంటే అంతవరకూ—పోతానంటే ఇంగ్లాండు కూడా పంపేబాధ్యత మీదవేసుకుని—చదివించినట్టయితే నాకు తినేటందు కింత లేకపోలేదు. నాకూ ఇరవై యెకరాల ఆస్తివుంది —అంతా స్వార్జితంసుమండీ. జోలెపట్టుకు తిరిగి సంపాదించాను. గడిచిన పదేళ్ళనుంచీ ఏరోజున నేను జోలె అవతలపారేసినా నాకు హాయిగా వెళ్ళిపొయ్యేదే. కాని ఈ కుర్రవాడి కోసమే నేను యాచనచేశాను. నాబొందెలో శ్వాసవుండగా నేను కూడబెట్టగలిగిన ప్రతి చిల్లిగవ్వా వాడిచదువుకింద ధారపోయటానికే సంకల్పించాను. న్యాయంగా మా పెద్దవాడికి ఆస్తి కొంతఇవ్వాలి చూడండీ. అదికూడా పాటించకుండా పూచిక పుల్లతోసహా మా రెండోవాడి చదువుకే ధారపోద్దామనుకున్నాను. ఆడపిల్లలక్కూడా ఏమీపెట్టినవాణ్ణికాలేదు. వాళ్ళందరికీ ఏదోవిధంగా గడిచిపోతున్నదిగదా, పోనీ ఈ వున్నదిపెట్టి వీణ్ణి ఎంత పైకితీసుకురావచ్చునో చూతామనిపించింది.....

"ఎందుకో కొంతకాలంగా నాలో స్వార్థం కలుగుతున్నది. ఆడపిల్లలకు తలా రెండెకరాలైనా ఒదిలి ఈకట్టెను వొదిలేద్దామనిపిస్తున్నది. మా పెద్దవాడి కిందులో సహమైనా ఇద్దామా అనిపిస్తున్నది. వాడుకూడా నామాదిరిగానే ముసలితనంలోకూడా యాచనచెయ్యాలా ఏమిటిరా, ఈశ్వరా అనిపించి జాలివేస్తున్నది. కాని పిల్లవాడిచదువు ఎటూకాకుండా చెప్పించటం ఇష్టంలేదు. మొదట బియ్యేవరకూ చదివింతామనుకున్నాను. బియ్యే పరిపాటి

అయిపోయింది. బీ యల్ చదివింతామనుకున్నాము. అదీ చపుకయి పోతున్నది. ఏ ఐ.సీ.యస్సయినా చదివిస్తేనేగాని నా మొదటిగురికి తగిలేటట్టు లేదు. నాదగ్గిర ఈ ఆస్తి వుంచుకుని వాడి చదువు నడిమధ్యలో ఆపెయ్యటం అదీ ధర్మంగా కనిపించటంలేదు ఒకటి రెండేసి ఎకరాలు ఆడపిల్లలకిచ్చినా. పోనీ పదెకరాలు నాపెద్దవాడికిచ్చినా. అందువల్ల అయే వినియోగంకంటె అంతా ఖర్చు చేసి అయినా—చదు వింత అంటుతున్నది గనక—వీడిమీదే వినియోగపరిస్తే ఉత్తమ ఫలం ఉంటుందేమోననే ఆశపీకుతున్నది.

"పంతులుగారూ. ఈ సందిగ్ధావస్తలో నాకొక్క టే పుభయతారకమైన ఊహతోచింది. ఇంత కలవారి పిల్లను చేసుకుని మా రెండో వాడి చదువుబాధ్యత వారికే వొదిలేసి ఈ ఉన్న తృణమూ పెద్దపిల్లలకిచ్చేసి నేనుకూడా—ఇంకా ఎంతలెండి—నాలుగు ఘడియలపాటు భగవధ్యానం చేసుకుందామనే స్వార్ధంలో పడ్డాను. ముసలివాడికెంత తృష్ణరా అనుకుంటారేమో కడుపులోవున్న ఆలోచన పైకి అనేశాను."

అయిదారు నిమిషాలపాటు ఇద్దరూ మాట్లాడలేదు. గోపాలం తన ఎదురుగా వున్న ఈ విచిత్రమైన వ్యక్తిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు. ఇంతకాలమూ ఈయన వొట్టిలోభి అనీ. యాచనా ప్రవృత్తి కలవాడనీ గోపాలం విశ్వసించాడు. అటువంటివాడు "ఇప్పుడు నాలో స్వార్థం ప్రవేసిస్తున్నది." అని ఒప్పుకుంటుంటే గోపాలానికి చెప్పరాని ఆశ్చర్యం కలిగింది. ఇంతకాలమూ ఈముసలాడు తన చిన్నకొడుకు కోసం ఇంతపెద్ద ప్రయత్నంమీద బయల్దేరాడని వింటుంటే ఈ "ఛాందసుడు" అగస్త్యుడంత ఎత్తయిన మనిషిగా కనిపించాడు. ఎన్నేళ్ళ శ్రమ. ఎంతదీక్ష! ఈ చాదస్తపుశాస్త్రుల్లుగారితో పోలిస్తే పదవులకోసమూ బిరుదుల కోసమూ దేవులాడేవాళ్ళంతా క్రిములకన్న తక్కువ ప్రమాణంలో కనిపించారు గోపాలానికి. మామూలులెక్కన తను తెలివిగల వాళ్ళలో జతే అయినప్పటికీ దాదాపు పదేళ్లగా చూస్తున్న ఈ శాస్త్రుల్లుగారిని ఆయన తన మనస్సులో మాట బయటికి చెబితే తప్ప అర్థంచేసుకోలేక పోయినాదే!

"మీరు కోరినట్టుగా జరుగుతుందనుకుంటాను. మీ స్వార్థం ఏమీలేదు. మీ కోరిక చాలా సవ్యమైనది. నాకే డబ్బుంటే మీభారం నేనువేసుకుని మీ పిల్లవాడికి చదువుచెప్పించి నాకూతుర్నిచ్చి వివాహంచేతును. ధనికులంతా ఐసీయస్ పాసయిన అల్లుళ్ళను వెతికి వేలకు వేలు పోస్తారేగాని సత్యంలాంటివాణ్ణి చూసుకుని ఐసీయస్ పాసు చేయించే కీర్తి మీద వేసుకోరు. ఇది తల్లకిందులు ప్రపంచం." అన్నాడు గోపాలం.

"మీరు చెప్పదలిందేదో చెప్పారుకారు." అన్నాడు శాస్త్రుల్లుగారు. గోపాలానికా ప్రశ్న అర్థంకాలేదు.

"మావాడి పెళ్ళి ప్రస్తాపన ఏ వుద్దేశంతోనో తెచ్చారు. నాసొంత గొడవతో మిమ్మల్ని చెప్ప నిచ్చానుకాను."

గోపాలాని కి సంగతి జ్ఞాపకంచెయ్యగానే అకస్మాత్తుగా బిడియంపట్టుకుని మొహం జేవురించింది.

"ఎబ్బే. అది వేరే విషయంలెండి. అదేమీ కుదిరేదికాదు. మనకు పొసగే సంగతికాదు." అని గోపాలం నీళ్లు నమిలాడు.



భైరవ శాస్త్రుల్లునవ్వి. "నా చెవినకూడా వెయ్యరాదా?" అన్నాడు.

"నా స్నేహితుడొకతను—బొత్తిగా లేనివాడే. పాపం. అయితే బహుయోగ్యుడు—తన పిల్లకు తెలివిగల కుర్రవా డెవడన్నా దొరికితే చూడమని నాకు రాశాడు. వైదీకే. పిల్ల చాలా తెలివిగలది. సంగీతం చక్కగా పాడుతుంది. ఫిదేలు వాయిస్తుంది. ఇంటిపనన్నీ చేస్తుంది. చాలా బుద్ధిమంతురాలు. ఆశగదా? మంచి సంబంధంకోసం చూస్తున్నాడు. కట్నం ఇచ్చుకోలేడు. ఖర్మం!....సత్యానికి చేసుకుంటే ఇద్దరూ ముచ్చటగా ఈడుజోడుగా వుంటారని ఆలోచన పోయింది గాని....మీరు పెట్టుకున్న లైనుకూ దీనికీ కలవదు. అడిగారని చెప్పానుగాని నాకే సిగ్గుగావుంది చెప్పటానికి. మీ మనస్సులోఉన్న ఆలోచన సబబైనదని తెలిసి ఇక ఈ విషయం ఎట్లా ప్రస్తావించనూ?" అన్నాడు గోపాలం.

భైరవ శాస్త్రుల్లు మళ్లా ఒక నిమిషంపాటు నేలకేసిచూసి తలపైకెత్తి. "మీరప్పుడే ఆ స్నేహితుడికేమాటా రాయకండి. రేపీపాటికి నేనేవచ్చి మళ్ళీ మాట్లాడతాను! నాకు సెలవిప్పించండి." అంటూ లేచాడు.

గోపాలం ఆమాటమీద ఆటే ఆశ పెట్టుకోలేదు.

## 5

గోపాలం మళ్ళీ పొరపాటు పడ్డాడు.

మర్నాడు సాయంకాలానికి భైరవశాస్త్రుల్లు మళ్ళీ వచ్చి కూర్చుని. "అయ్యా. మీ స్నేహితుణ్ణి ఒకసారి రమ్మనండి వీలయితే పిల్లనూ. పిల్లజాతకాన్ని వెంటపెట్టుకు రమ్మనండి. ఆలస్యాదమృతం విషం." అన్నాడు.

"మీరేమీ తొందరపడటంలేదుకద? కాస్త విచారిస్తే సత్యానికి మంచి సంబంధం దొరుకుతుందేమో. పిల్లలనిచ్చేవారు వేలకు వేలు పిల్లవాడికి ధారపోయకపోయినా. అప్పుపెట్టవచ్చు. తరవాత సత్యం తీర్చుకోలేకపోతాడా?" అన్నాడు గోపాలం.

శాస్త్రుల్లుగారు తల అడ్డంగాతిప్పాడు.

"కన్నతండ్రిని నేను పస్తాయిస్తే పిల్లనిచ్చిన మామగారు డబ్బుతెచ్చిపోస్తాడా? అంత సులభంగా డబ్బుపొయ్యగల లక్షాధికారి తనకూతుర్ని మా వాడికిస్తాడా? గొంతెమ్మకోరికలు! నేను నిన్ననే మనవి చేస్తినే....ధీరుడైనవాడు తలపెట్టిన పనులు తుదముట్టించవలిసిందే. మీ స్నేహితుణ్ణి పిలిపించండి. మీ ఆప్తులకంటె మా కాప్తులు లేరు."

మరో వారంరోజులకల్లా సత్యంపెళ్లి స్థిరపడింది. ఇంకో పదిరోజులకు పెళ్లి జరిగిపోయిందికూడానూ.

సత్యానికి ప్రెసిడెన్సీ కాలేజీలో సీటు వచ్చింది. అతను మద్రాసు బయలుదేరి వెళ్లేటప్పుడు గోపాలం కొన్నిముక్కలు చెప్పాడు.

"దేవుడనుకూలిస్తే నువు చాలా ముందుకొస్తావు. కాని ఒకటి జ్ఞాపకం పెట్టుకో. నువు మీ నాన్నగారికి రుణపడబోతున్నావు—ఒకవిధంగాకాదు. రెండు విధాలుగా. నీమీద ఆయన పెద్ద ఆశలు పెట్టుకున్నాడు. నువు మరికొన్ని సంవత్సరాలపాటు అహోరాత్రాలు దీక్షతోపనిచేస్తే తప్ప ఆ ఆశలు ఫలించవు. ఆయన నీకోసం నువు పుట్టినప్పటినుంచీ దీక్షగా నీకోసం పని చేశాడు. ఇంకా చేస్తున్నాడు. అది మరచిపోకు. ఆయన ముసలివాడు. నువు కుర్రాడివి.

అందుచేత నీ దీక్షకంటె ఆయనదీక్ష గొప్పది. నువ్వు చెయ్యవలసింది అసాధ్యమైన విషయం కాదు — సివిల్‌సర్వీసులో చేరేవాళ్ళంతా చేస్తున్నపనేకాని మీ నాన్నగారు చేసినపని అసామాన్యమైనది. అటువంటిత్యాగం ఏ తండ్రీ చెయ్యడు.

"రెండోసంగతి ఏ మి టం టే. నువు రూపాయి అణాపైసలతో నీ తండ్రిగారికి రుణ పడ బోతున్నావు. జ్ఞాపకం పెట్టుకో, అదితీర్చ వలసినబాకే. ఆరుణం తప్పించుకో దలిస్తే నువు ఏ ప్లీడరుపరీక్షో చదివేసి ప్రాక్టీసు పెట్టుకోవటంతప్ప మరోదారిలేదు. కాని ఆపని చేస్తే మీ నాన్నగారికి ఆర్థికమైనబాధ తప్పిస్తావుగాని ఆయనపడ్డ శ్రమంతా వృధా అవుతుంది."

సత్యం ఈ విషయాలు జ్ఞాపకం పెట్టుకుని దీక్షగా చదువుతా నన్నాడు.

పట్నంచదువుప్రారంభించినాక, చిన్నతనం నుంచీ పట్నంలోనే ఎందుకు చదవకపోతినా అనిపించింది సత్యానికి. ఈకాలపు చదువుకు తగిన వాతావరణం పట్నంలో వున్నట్టుగా చిన్న బస్తీలలో ఉండదు. అక్కడ ఎంతో తెలివిగల వాళ్లనిపించుకునే సత్యంవంటి విద్యార్థులకంటె ఇక్కడి సామాన్య విద్యార్థుల కెక్కువ లోకజ్ఞానం వుంటుంది. తనతోటి విద్యార్థుల్లో ఎంతో సంపన్నులూ, గొప్ప సంబంధాలుకలవాళ్లూ, అనేకరకాల వుద్యమాల్లో తిరిగేవాళ్లూ, ప్రతిభావంతులూవుండటం కనిపెట్టి వాళ్ళ సహవాసాలు సంపాదించ సాగాడు. అతన్నికూడా వాళ్ళు చాలాతెలివిగల విద్యార్థుల్లో ఒకడికింద స్వీకరించారు.

సత్యానికి లెక్చరర్లతోకూడా కొంత చనువు దొరికింది. సత్యం ఐ.సీ.యస్. మీద ఆశ పెట్టుకున్నాడనితెలిసి వాళ్ళుకూడా ప్రోత్సహించి సలహాలిచ్చారు. ఆ సలహాల నతను వేదవాక్యాలుగా పాటించాడు. కాలేజి చదువు కాక సత్యం యూనివర్‌సిటీ లైబ్రరీలో అనేక గంటలు గడిపేవాడు.

అతనికి ఎంత డబ్బుకావలసినా తండ్రి పంపిస్తూవచ్చాడు. ఆడబ్బు తప్ప సత్యానికి ఇంటి వాతావరణంతో ఏమీ సంబంధం లేకుండా పోయింది. పట్నం వచ్చేవరకూ సత్యం తన యింటి సంస్కారపు గిరులు దాటి పోనేలేదు. కాని ఇప్పుడు దాన్నిదాటి ఎంత పైకివెళ్ళితే తనకంత ఉపయోగ మనిపించింది. పొదుపూ, పూర్వసంప్రదాయాలూ మంచితనమూ — ఈ విలవలేవీ తనకు పనికొచ్చేవికావు.

## 6

సత్యం ఆనర్సుపరీక్షలో చాలా జయప్రదంగా ఉత్తీర్ణుడైనాడు. తరవాత కొద్ది కాలానికి ఐ.సి.యస్. ప్రవేశ పరీక్షలో నెగ్గి ఏరుకోబడ్డాడు.

భైరవశాస్త్రుల్లు ఆరోగ్యం కొంతకాలంగా బాగాలేదు. ఆయన ఎక్కడికీ కదలటంలేదు. పెద్దకొడుకు సంసారం ఖర్చులుకూడా జాస్తి అయింది. ఆయనఇద్దరు కూతుళ్ళకుపెళ్ళిచేశాడు. సామాన్యసంబంధాలు తెచ్చినా కట్నాలు పొయ్యవలసి వచ్చింది. రాబడి ఖర్చుకు చాలలేదు. కాని భైరవశాస్త్రుల్లు అణాచీటి మీద ప్రాణంపోయినా దస్కతు పెట్టలేదు. అయినకాడికి పొలం తెగనమ్మి ఖర్చుజరిపాడు.

సత్యం ఖర్చుముం దీఖర్చులన్నీ కలిపినా ధూపానికి రాలేదు. ఈ సంగతి భైరవశాస్త్రుల్లు అనుకున్న దేగనక ఆయనఏమీ విచారించలేదు. ఇంగ్లండు వెళ్ళిన తరవాత సత్యంఖర్చు అంతు లేకుండా పెరిగిపోయింది. "డబ్బు జాగ్రత్తగా



వాడు." అని రాద్దామని ఎన్నిసార్లో కలం చివరదాకా వచ్చింది. కాని శాస్త్రుల్లు నిగ్రహించు కున్నాడు. సత్యాన్ని ఏవిధంగానూ నిరుత్సాహపరచరాదు. వాడు తన చదువు విషయంలో శ్రద్ధవహించినన్నాళ్లూ ఇంకేం జరిగినా పరవాలేదు.

ఇంగ్లండులో శిక్షణపొంది దొరవేషంతో సత్యం దిగాడు. భైరవశాస్త్రుల్లు నిట్టూర్చాడు. సత్యం పైస్వరూపమే కాకుండా అతని ప్రవృత్తికూడా చాలా మారిపోయినట్టు కనిపించింది. జీవితంగురించీ, జీవిత సమస్యల్ని గురించీ ఒక నిర్లక్ష్యభావం కనిపించింది. అది నిర్భయంకాదు, నిర్లిప్తతకూడాకాదు. అనేక స్వల్పవిషయాల్లో సత్యాని కెంతో లౌకికశ్రద్ధ వుంది. తనదుస్తులు కొంచెం మడతనలిగినా రాద్ధాంతంచేస్తాడు. గడియారంప్రకారం పని చేస్తున్నట్టుగా తను అనుకున్నదానికి ఒక నిమిషం జాగయితే అల్లాడిపోతాడు. ఇదంతా ఒక కొత్తసంస్కారమని శాస్త్రుల్లుకు తట్టలేదు. తనకొడుకు కీ లక్షణాలన్నీ అలవాటు చేసుకున్నాడని నమ్మాడు. సత్యంనేర్చిన కొత్త అలవాట్లన్నీ ఇంకా ఆయనకు తెలీవు. అదంతా తెలుసుకునే అవకాశం లేక మునుపే భైరవశాస్త్రుల్లుకు పెద్ద కనువిప్పయింది. సత్యం ఇంతవరకూ భార్యను తెచ్చుకోలేదు. ఇప్పుడాపని చెయ్యమని తండ్రి హెచ్చరిస్తే సత్యం సరిగా వినిపించుకోలేదు.

భైరవశాస్త్రుల్లుకు కొడుకుమీద అనుమానం కలిగింది. ఏమిటి వీడి ఆలోచన? చవుకబారువెధవలు చేసినట్టుగా అక్కడ ఏదొరసాన్నో మరిగివచ్చాడా? లాంఛనగా ప్రాయశ్చిత్తం చేసుకోమంటేనే సత్యం నీళ్ళు నమిలాడు. కాని ఎవ్వరికీ తెలీకుండా ఆతంతు చేసేశాడు భైరవశాస్త్రుల్లు.

ఇక గర్భాధానం విషయంలో సత్యం లొంగేట్టు కనిపించలేదు. కాస్త రెట్టించి హెచ్చరించగా, "ఇంతచదువూ చదివి నావిషయాలు నేను చూసుకోలేనా? నాకెందుకింత చెప్పటం?" అన్నాడు.

"ఒరే, కొన్నివిషయా లెంత చదువు చదివినా తెలీవు. అవి పెద్దవాళ్ళుచెబితే తెలియవలసిందే."

సత్యం ఏదో గొణిగాడు.

త్వరలోనే అతన్ని దూరదేశం వేశారు. అతనక్కడ ఎవతెనో — నల్లదాన్నే — పెట్టుకు వుంటున్నాడని వదంతులు వినిపించినై. సత్యం మామగారు తన వియ్యకుండితో సంప్రదించి తనకూతుర్ని పట్టుకుని అల్లుడిదగ్గిరికి వెళ్లాడు.

సత్యం మామగారితో ఏమీమాట్లాడతేదు గాని భార్యతోనే మంచిగా చెప్పాడు.

"నేను బుద్ధెరగనప్పుడు మానాన్న నీకూ నాకూ పెళ్ళిచేశాడు, నాకు నీమీద ఏమీ కోపంలేదు. కాని ఇంగ్లండులో నాకొక బెంగాలీపిల్లతో స్నేహమయింది. ఆపిల్ల అక్కడ చదువుతూండేది. పత్రికలకు రాస్తూండేది. ఆ అమ్మాయికి పెళ్ళికాలేదు. నువ్వడ్డంలేకుండా వుంటే మేమిద్దరమూ పెళ్ళాడి వుండేవాళ్ళం. కాని మాకిప్పుడా అవకాశంలేదు. నాతో స్నేహంగా వుండటానికైనా ఒప్పుకుందిగాని మరొకర్ని పెళ్లాడటాని కిష్టపళ్ళేదు. నేను నిన్నెరక్కమునుపే ఆమె నెరుగుదును. నీకోసం ఆమెను తరిమెయ్యమన్నావా? నావల్ల కాదు."

"నేనెక్కడికి పోతాను? నన్నుకూడా ఇక్కడే ఉండ నివ్వండి," అన్నది అతని భార్య.



"వుండు. నాకేమీ అభ్యంతరంలేదు. కాని నామీద నీకే అధికారము వుందనుకోను. ప్రతి దానికీ నసపెట్టకు. అప్రకారమయితే ఉండు."

సత్యంభార్య సరస్వతి ఒకనెలపాటు భర్త దగ్గిరఉంది. సత్యం తాగుడూ, ఆ బెంగాలీ అమ్మాయికూడా అతనితోపాటు తాగటమూ, ఇద్దరూ తనని లక్ష్య పెట్టకుండా నానావికార చేష్టలూ చెయ్యటమూ, తనను ఇంటో నౌకరు కన్న అధమంగా చూడటమూ సహించలేక తనను పంపించమని భర్తనడిగింది. అత నామె వెంట నౌకరిన్నా లేకుండా పంపాడు. అయితేనేం? సెకండు క్లాసులో ఎక్కించి పంపాడు.

"శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః"

గోపాలం కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటూ తుళ్ళిపడి లేచాడు. చంకలో జోలె, చేతిలో తళతళామెరిసే చెంబూ పెట్టుకుని భైరవశాస్త్రుల్లు ప్రత్యక్షమైనాడు.

"రండి, శాస్త్రుల్లుగారూ, కూచోండి." అని గోపాలం ఆయన్ను బలవంతంగా కూచోబెట్టి, "ఏమిటిది?" అని ప్రశ్నించాడు.

"అత్యాశకు పోయినందుకు, శాస్తి.... చూడండి, బాబూ మనిషైనవాడు విచ్చలవిడిగా తాగటమూ, ఎవత్తెనో పెట్టుకుని ఊరేగటమూ నేర్పేచదువేం చదువూ? ఇటువంటి చదువులుకూడా ఉంటాయా? మనుషులు దుర్బుద్ధివల్ల ఇటువంటిపన్లు చేస్తూంటారనుకునేవాణ్ణి. చదువువల్లకూడా ఇవి అబ్బుతాయా" అన్నాడు భైరవశాస్త్రుల్లు.

"దుర్బుద్ధులందరిలోనూ వుంటూంటై. అయితే ఒక్కోచదువు సంఘభయం పోగొట్టేస్తుంది. దైవభీతి పోగొట్టేస్తుంది. సంఘభీతే దైవభీతి అనుకొండి. ఈ చదువు సంఘభీతి పోగొట్టటమేకాక సంఘానికి మీమీద నామీద ఉండే కట్టుబాటుకూడా లేని అవకాశాలు కల్పిస్తుంది, డబ్బు పుష్కలంగా ఇస్తుంది. ఇంక అడ్డేమిటీ?" అన్నాడు గోపాలం.



"ఎంత పొరపాటూ! మీవంటి తెలిసినవాళ్లుండికూడా నాతోమాటమాత్రం చెప్పకపోతిరే?"

"చెప్పుదామని నాకు నోటిదాకావచ్చింది కాని మీరు డబ్బు సంపాదనే ఘనంగా చూసినట్టు కనపడ్డారు. లేనిపక్షంలో మీపెద్దవాడి విషయంలో మీరు అసంతృప్తిపడవలసిన అవసరం ఏముందీ? అతను ఎంత పెద్ద మనిషి! చదివిన చదువులో ఎంతగట్టివాడు!"

"వాడే నానిజమైన కొడుకు. ఈ వెధవ నాకొడుకేకాడూ! వాడిపెళ్ళానికి రెండెకరాలు రాసి ఇస్తున్నాను. నేను ముష్టెత్తుకుబతుకుతాను. ఎంతకాలంలెండి? అయిపోయింది. పిల్లలుగలవాడు, నాకున్న ఆ స్తంతా నాపెద్ద కొడుకే తింటాడు."

"మీరెంతసేపూ డబ్బే ఆలోచిస్తున్నారు. మీచిన్నవాడిమీది పంతం కొద్దీ—వాడు అందరికళ్ళలోనూ నికృష్టుడుగా కనిపించాలని —ఈ జోలె పట్టుకున్నారుగాని మీకు తిండి జరగదా?....నన్నడిగితే మీవాడిదేమీ తప్పు లేదు. తప్పంతా మీదే. వాడి జన్మకి చదువుతప్ప మరొకటి లేకుండా చేశారు. వాడికి ప్రపంచంగొడవ తెలీదు. ఒక సాహిత్యంలేదు, ఒక పురాణంలేదు, ఆఖరుకు ఒక సుమతీ శతకం పద్యమైనా వాడికిరాదు. నేనెరిగినమటుకు వాడొక నాటకంగాని సినిమాగాని చూసిన పాపాన పోలేదు. ఇది కూడును, ఇది కూడదు అనే జ్ఞానం వాడికెట్లా వస్తుందీ? ....వాడిమానాన వాణ్ణి జీవించ నివ్వండి. ఇంతడబ్బు పంపిస్తూ ఉంటాడు ఖర్చుపెట్టుకోండి," అన్నాడు గోపాలం.

"వాడిడబ్బు నాకవసరంలేదు. అదినాకు విషంతో సమానం!"

"మన ఇచ్ఛలన్నీ పిల్లలద్వారా తీర్చుకుందామని ప్రయత్నంచేస్తే ఇదే జరుగుతుంది. వాళ్లు మనకు దక్కకుండా పోతారు.... ఫర్వాలేదు, మీవాడు మీకు డబ్బు దానం చెయ్యడు—మీబాకీ తీరుస్తాడు. మీది మీరు దక్కించుకుని అంతతో తృప్తిపడండి. మీ మనమడికి పనికొచ్చే చదువు చదివించండి. వాడు తనపొట్ట పోసుకుంటూ నలుగురికీ ఉపయోగ పడేటట్టు చదివించండి." అన్నాడు గోపాలం.

తను అన్నమాటలు భైరవ శాస్త్రుల్లుకు కష్టం కలిగించినమాట గోపాలానికి తెలుసును. ఆయనకు కోపం తెప్పించాలనే అన్నా డా మాటలు. ఎన్నడూ తనయింటికి ఉపాధానానికి రాని శాస్త్రుల్లివాళ్ల రావటం దేనికి? గోపాలం సానుభూతి సంపాదించటానికి తప్పితే!

ఆయనకు ఉపాధానం వెయ్యనే లేదన్న సంగతి భైరవ శాస్త్రుల్లు వెళ్ళిపోయిన పావుగంటకిగాని స్ఫురించలేదు గోపాలానికి.

